www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 13 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## ప్రథమ సంవత్సరంలో నాల్గో స్థానం





-ద్వితీయలో ఆరవ స్థానం
-విడుదలైన ఇంటర్ ఫలితాలు
-మే13 నుంచి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ

2లో

# ఎన్నాళ్లీ ఎదురుచూపు..!

## -నియామకపు పదవులపై తీవ్ర జాప్యం
## -నిరాశలో ఆశావాహులు







**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్టీ అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి రాకపోతుందా ముందు పార్టీ అధికారంలోకి రావాలన్న తపనతో పార్టీ విజయానికి కృషి చేశారు. అనుకున్నట్లుగానే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. అధికారం చేపట్టి రెండున్నర ఏళ్లు కావస్తున్నా ఇదిగో అదిగో అంటున్నారు తప్ప పదవుల భర్తీ జరగడం లేదు. రాష్ట్ర స్థాయి కార్పోరేషన్ ఛైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు మినహా మిగిలిన పదవులను భర్తీ చేయడం లేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఇంచార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ ల సమక్షంలో పలు మార్లు నియామకపు పదవులపై ప్రకటనలు వచ్చిన ఆచరణలో మాత్రం అడుగు ముందుకు పడటం లేదు. సంక్రాంతి ముందు, ఉగాది ముందు, తర్వాత అంటూ ఊహాగానాలు ప్రచారాలు జరుగుతున్నాయి తప్ప పదవుల భర్తీ జరిగింది లేదు. మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల అనుచరులు వారి వారి ప్రయత్నాల్లో ఉన్నారు. అధికారంలోకి వచ్చి సగం రోజులు పూర్తయినా నియామకపు పదవులు భర్తీ చేయకపోవడంపై ఆశావాహులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఆశావాహుల్లో కొందరు పదేళ్లు

మిగతా 2లో..

## నిబద్ధతకు మారుపేరు హిమవంతరావు



-విగ్రహావిష్కరణలో తుమ్మల




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయునిగా, ఎంఎల్‌సిగా పనిచేసిన సామినేని హిమవంతరావు క్రమశిక్షణకు, నిబద్ధతకు, నిజాయితీకి మారుపేరుగా నిలిచారని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం పిఆర్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన మాజీ ఎంఎల్‌సి, పిఆర్‌టియు వ్యవస్థాపకులు దివంగత సామినేని హిమవంతరావు విగ్రహాన్ని ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిఆర్‌టియు వ్యవస్థాపకుడైన సామినేని హిమవంతరావు ఖమ్మం జిల్లాలో తనదైన ముద్ర వేశారన్నారు. ఉపాధ్యాయునిగా ఎంతో క్రమశిక్షణకు, నిబద్ధతకు, నిజాయితీకి మారుపేరుగా నిలిచారన్నారు. ఎన్‌టిఆర్ ఆశయాలకు అనుగుణంగా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షునిగా పనిచేసి నిజాయితీ గల నాయకునిగా ఉన్నారన్నారు. ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేసి రైతాంగానికి అండగా నిలిచారన్నారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బాటలు వేశారన్నారు. ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు ఎంఎల్‌సి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దామోదర్‌రెడ్డి, ఎస్. బిక్షం గౌడ్, జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్‌రావు, మాజీ అధ్యక్షులు మోత్కూరి మధు, వైవి, అసోసియేట్ అధ్యక్షులు రెబ్బా శ్రీనివాసరావు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బ్రహ్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు గుడిపూడి శ్రీనివాసరావు, పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా ఆంజనేయస్వామి ముత్యాలమ్మ బొడ్రాయి ప్రతిష్ఠ



### పాల్గొన్న మంత్రి పొంగులేటి, మాజీ ఎమ్మెల్యే కందాళ

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** మండల పరిధిలోని మేకల తండా లో గత మూడు రోజులుగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది గ్రామం లో ఆంజనేయస్వామి ముత్యాలమ్మ బొడ్రాయి ప్రతిష్ఠ నిర్వహణను మేకల తండా గ్రామానికి చెందిన ఆలయ ఛైర్మన్ గుగులోత్ గణేష్, వైస్ ఛైర్మన్ బోడ శంకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమం విజయవంతంగా సాగింది. మొదట ఆంజనేయ స్వామి దేవాలయం నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన మూడు నరేంద్రబాబు తారాబాయి దంపతులు ఆలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించారు. దీంతో ఆలయ నిర్మాణానికి అంకురార్పణ జరిగింది. దీనితోడు ఆలయ కమిటీ సభ్యులు కంకణ బద్ధులై ఆలయ నిర్మాణాన్ని శరవేగంగా నిర్మించడానికి గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించారు. మేకల తండా సమీపంలో గ్రానైట్

మిగతా 2లో..

# ఎన్నాళ్లీ ఎదురుచూపు..!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ అధికారంలో లేకపోయినా నిర్బంధాలు, అవమానాలకు ఎదురొడ్డి పార్టీ పక్షాన పని చేసిన వారు కాగా, ఎన్నికల ముంగిట వివిధ పార్టీల నుండి కాంగ్రెస్‌లో చేరి పార్టీ విజయం కోసం కృషి చేసి పదవులపై ఆశలు పెంచుకున్న వారు వివిధ సందర్భాల్లో పార్టీ నేతల నుంచి నియామకపు పదవులపై హామీ పొందిన వారు కూడా ఇంకెప్పుడు హామీ నెరవేరుతుందా అన్న మీమాసంలో ఉన్నారు. ఉదాహరణకు దశాబ్ద కాలం పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసిన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను సుడా (స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ఛైర్మన్‌గా నియమించనున్నట్లు చాలా కాలంగా ప్రచారం జరుగుతుంది. పువ్వాళ్ల విషయంలో ముగ్గురు మంత్రులు ఏకాభిప్రాయంతో ఉన్నారని అతి త్వరలోనే ప్రకటన అంటూ ఏడాది కాలంగా చెబుతున్నారు. అడుగు ముందుకు పడలేదు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరుగుతుంది. బిఆర్ఎస్ పాలనలో ట్రస్ట్ బోర్డు నియమించకుండా భద్రాచలం పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నర ఏళ్లు కావస్తున్నా ఛైర్మన్‌ను నియమించకపో వడంపై కాంగ్రెస్ బిఆర్ఎస్ తరహా విమర్శలనే ఎదుర్కొనక తప్పని స్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న క్యాడర్‌లో ఆ జోష్ కనిపించడం లేదన్నది వాస్తవం. నాయకులు, ప్రజాప్రతినిధుల పర్యటనల సమయం లో ఒక స్థాయి నాయకులు పైరవీకారుల జోరు కనిపిస్తున్నప్పటికీ దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని పనిచేస్తున్న వారిలో కదలికలు అంతగా లేవు. ఎవరు అధికారంలో ఉన్న పైరవీకారులదే నడుస్తుండటం క్యాడర్‌కు క్షేత్రస్థాయిలో పనులు కాకపోవడం జోష్ తగ్గేందుకు కారణమైంది. మూడు పార్టీలు మారి అధికారంలోకి వచ్చాక పార్టీలో చేరిన వ్యక్తికి మాకు సమాన ప్రాధాన్యతనిస్తుంటే ఇన్నాళ్లు ఇబ్బందులు పడి క్యాడర్‌ను కాపాడుకున్న వారికి అవమానమేగా అని ఒక మండల స్థాయి నాయకుడు వాపోయారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొందరు నాయకులు తామే నాయకులుగా, తామే గుత్తేదారులుగా వ్యవహరిస్తుండడం పైన క్యాడర్ పెదవి విరుస్తుంది. అధికారం పది కాలాల పాటు మనగలిగి మరింత బలపడాలంటే క్యాడర్ ఉత్సాహంగా పనిచేయాలి. క్యాడర్‌లో జోష్ నింపే ప్రయత్నంలో నియామకపు పదవులను భర్తీ చేయాలి. ఇప్పటికే రెండున్నర ఏళ్లు గడిచి పోయాయన్న భావన వ్యక్తమవుతుంది. బిఆర్ఎస్ పట్టించుకోని రామాలయానికి రూ. 350 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌ను నియమించి విస్తృత పరిస్తే రామభక్తులు మరింత సంతోషిస్తారు.

# వైభవంగా ఆంజనేయస్వామి ముత్యాలమ్మ బొడ్రాయి ప్రతిష్ఠ

(మొదటిపేజీ తరువాయి)



నిర్వహిస్తున్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సుమారు 5 లక్షల రూపాయల విరాళాన్ని అందించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం అందించారని కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు గ్రామంలో వేద పండితులు విగ్రహాలకు వేదమంత్రాలతో పూజలు నిర్వహించిన అనంతరం ఆదివారం ఘనంగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి దాతలుగా ఆలయ చైర్మన్ గుగులోత్ గణేష్ గుగులోతు బాలాజీ భద్రమ్మ దంపతులు బొడ్రాయిని తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ తల్లిని బోడ శంకర్ వినోద దంపతులు ఏర్పాటు చేశారు ఆంజనేయస్వామి విగ్రహన్ని పాలిత్య పాణిత్య శ్రీకాంత్ ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం హైదరాబాద్ నగరానికి చెంది న కార్పొరేటర్ కుతడి రవీందర్ రేణుక దంపతులు ఏర్పాటు చేయగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆలయ కమిటీ చైర్మన్ గూగులోత్ గణేష్, వైస్ చైర్మన్ బోడ శంకర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ప్రథమ సంవత్సరంలో నాల్గో స్థానం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇంటర్మీడియట్ బోర్డు ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను ఆదివారం విడుదల చేసింది. ప్రథమ సంవత్సరంలో రాష్ట్రంలో ఖమ్మంజిల్లా 72.02 శాతం ఉత్తీర్ణతతో నాల్గవ స్థానాన్ని సాధించగా ద్వితీయ సంవత్సరంలో 81.60 శాతంతో ఆరవ స్థానాన్ని సాధించింది. ఖమ్మం జిల్లా నుంచి ప్రథమ సంవత్సరానికి సంబంధించి 15,299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 11,025 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 14,627 మంది విద్యార్థులు హాజరు కాగా 11,936 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 2190కు గాను 1321 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 1928కు గాను 1429 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 60.32, ద్వితీయ సంవత్సరంలో 74.12 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫలితాల్లో ఖమ్మంజిల్లా పురోగతి సాధిస్తూ వచ్చింది. గడిచిన మూడేళ్లతో పోల్చి చూసుకుంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలను సాధించారు. ప్రథమ సంవత్సరంలో 63.84 శాతం, 2025లో 71.15 శాతం, 2026లో 72.06 శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 2024లో 74.20 శాతం, 2025లో 77.60 శాతం, 2026లో 81.60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ విద్యార్థులు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కొరకు ఈనెల 13 నుండి 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె. రవిబాబు తెలిపారు. రీ కౌంటింగ్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ. 100 చెల్లించాలని, రీ వెరిఫికేషన్‌కు ప్రతి సబ్జెక్టుకు రూ. 800 లు చెల్లించాలని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు మే 13 నుండి నిర్వహించబడతాయని ఆయన తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు తమ తమ కళాశాలల్లో 13 నుండి ఈనెల 20లోపు ఫీజు చెల్లించాలని రవిబాబు సూచించారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిసి, బైపిసి విభాగాల్లో ఖమ్మం జిల్లా విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఖమ్మం శ్రీ చైతన్య కళాశాలకు చెందిన కె. జోత్స్న సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు 997 మార్కులతో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించింది. అదేవిధంగా ఎంపిసి సీనియర్ విభాగంలో పి. ప్రియ లక్ష్మి 1000 మార్కులకు గాను 996 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించింది.

# ఇంటర్ ఫలితాల్లో కృష్ణవేణి అత్యుత్తమ ఫలితాలు

**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం :**



ఇంటర్ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాల్లో కృష్ణవేణి జూనియర్ కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటిందని డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు లు తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో సీనియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను కె. కావ్యకళ 995, ఎం. చందన 995, ఎస్. నవదీప్ 994, పి. గణేష్ 994, సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను జి. ప్రహష్య 994, బి. సాయికీర్తన 992, జెఎల్ఎస్ మైత్రేయి 990 మార్కులు సాధించినట్లు వారు తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను బి. ఉదయ్‌కిరణ్, సిహెచ్ భావన, యు. ప్రణవి లు 468 మార్కులు, జె. లోహిత శ్రీ, ఎం శ్రావ్య, సాత్విక, పి. హవిల, కె. జోత్స్న, ఆర్. మనీషా, ఎస్. నందిన, కె. పల్లవి శ్రీ దుర్గలు 465 మార్కులు సాధించారని, జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు ఎల్. లోకేష్ 437, సిహెచ్ ప్రశాంత్ 437 మార్కులు, బి. సమత, జి. అఖిల, బి. జెస్సిక లు 436, ఎండి నౌషిన్, బి. శ్రావణి, ఈ. నిహారిక, పి. రిత్విక్‌రెడ్డి 435 మార్కులు సాధించారని, ఎంఈసి విభాగంలో 500 మార్కులకు గాను ఆర్. దీపిక శరణ్య 496, సిఈసి విభాగంలో 500 మార్కులకు గాను ఈ. గీతిక 489, జె. జెయేని 488 మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. గతేడాది తమ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధిస్తున్నారని దీనికి నిరంతర కృషి, విద్యార్థుల సహకారం, అధ్యాపకులు, తల్లిదండ్రుల తోడ్పాటు కారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు జగదీష్, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అకాడమిక్ డీన్ ఏలూరి వంశీకృష్ణ, ఎవో నిరంజన్, హెచ్‌వోడిలు లక్ష్మణ్, రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపక బృందం అభినందించారు.

# 'అన్నం ఫౌండేషన్' సేవలు ప్రశంసనీయం

**-భరత్ వర్ధంతి సందర్భంగా అన్నదానం : బాగం**






**ప్రజాపక్షం/ఖమ్మం :** 'అన్నం సేవా ఫౌండేషన్' సేవలు ప్రశంసనీయమని అభాగ్యుల పట్ల వారు చూపిస్తున్న ఆదరణ, ప్రేమ మరువలేనివని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మానవతను పెంపొందించే రీతిలో అనాథశరణాలయంలో సేవలు చేస్తున్నారని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ కుమారుడు పగడాల భరత్ రెండవ వర్ధంతి సందర్భంగా అనాథశరణాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని హేమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ భరత్ ఉత్తమ ఆశయాలతో జీవించాడని యుక్త వయస్సులోనే సమాజం పట్ల అవగాహన పెంచుకుని అందుకు అనుగుణంగా ప్రగతిశీల భావాలతో ముందుకు సాగాడన్నారు. దురదృష్టవశాత్తు భరత్ మరణించాడని భరత్ మరణం ఆయన కుటుంబానికే గాక కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటన్నారు. వారి కుటుంబ సభ్యులు వర్ధంతి సందర్భంగా అనాథ శరణాలయంలో అన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఏ దిక్కు లేని మతి స్థిమితం కూడా సరిగ్గా లేని వారికి అన్నం ఫౌండేషన్ ఛైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సేవలు అందిస్తున్నారని ఇది గొప్ప సేవా గుణమన్నారు. అనాథలకు, అభాగ్యులకు ప్రభుత్వం నుంచి సహాయం అందేవిధంగా కృషి చేస్తామని హేమంతరావు తెలిపారు. అన్నం ఫౌండేషన్‌కు సిపిఐ అన్ని విధాలా సహకరిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, భరత్ కుటుంబ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్, సువర్ణ, అవినాష్, విజయశ్రీ, సిపిఐ నాయకులు వరదా నర్సింహారావు, చింతల రమేష్, రావుల హన్మంతరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షా ఫలితంపై ఆందోళన

**-ఉత్తీర్ణుడై విషాదం మిగిల్చిన అక్షంత్**



**ప్రజాపక్షం/ఖమ్మం :** పరీక్షా ఫలితాలపై ఆందోళన ఉత్తీర్ణత సాధించలేమోనన్న బెంగ. తనపై తనకు నమ్మకం ఉన్న ఎక్కడో అనుమానపు పొర ఆత్మహత్య వైపు పురికొల్పింది. ఆ బెంగ చివరకు నిండు ప్రాణం బలి తీసుకుంది. ఫలితాలు వచ్చిన తర్వాత తమ కుమారుడు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడు కావడంతో ఆ కుటుంబ రోదన వర్ణణాతీతం. వివరాల్లోకి వెళితే... బోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన గంగదేవుల వెంకటేశ్వర్లు కుమారుడు అక్షంత్ (17) ఇంటర్ మొదటి సంవత్సరం వైరాలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. పరీక్షలు పూర్తయిన నాటి నుంచి ఎంతో బెంగతో ఉన్నాడు. ఈనెల తొమ్మిదిన సాయంత్రం మధిర వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్వర్లుకు ఇద్దరు కుమారులు కాగా ఇద్దరిని ఎంతో అపురూపంగా చూసుకునే వారు. వెంకటేశ్వర్లుది సైతం కష్టపడి పనిచేసే మనస్తత్వం. తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేక చదువును మధ్యలోనే వదిలేశానని నా పరిస్థితి నా కుమారులకు రాకూడదని తాను ప్రైవేటు స్కూల్ బస్సు నడుపుతూ పిల్లలను చదివిస్తున్నాడు. కానీ ఇంటర్ చదువుతున్న కుమారుడు ఉత్తీర్ణత సాధించలేనన్న బెంగతో ఆత్మహత్య చేసుకోవడం ఫలితాలు వెల్లడయ్యాక ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కావడం ఆ కుటుంబానికి మరింత విషాదాన్ని మిగిల్చింది. 470 మార్కులకు గాను 347 మార్కులు అక్షంత్ సాధించాడు. తొందరపాటు నిర్ణయాలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని మిగులుస్తాయని అనడానికి అక్షంత్ మరణమే ఓ ఉదాహరణ.

# ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ




**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం :** ఇంటర్ ఫలితాల్లో ఎస్ఆర్ కళాశాల ఖమ్మం విద్యార్థులు అత్యధిక మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారని కళాశాల ఛైర్మన్ వరదా రెడ్డి తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను ఎ. ఊహిత, ఎన్. గీత, కె. రేణుక, ఓ. జోత్స్న, షేక అస్మా, ఎం. వర్షిత, ఈ. లికిన్ లు 467 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను బి. హిమబిందు 438, డి. యోగిత 437, పి. ప్రియాంక 437, ఎం. వరూధిని 436, షేక్ ఖాజిన్ తౌసిఫ్ 436, జి. వర్షిత 435 మార్కులు, సీనియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను కె. రోహిణి 996, బి. ప్రశాంతిక రమ్య 995, సిహెచ్ సాత్విక్ 994, బి. పూజిత 994, బైపిసి విభాగంలో ఎన్. మేథా 990, పి. అనన్య 990 మార్కులు సాధించి సత్తా చాటారన్నారు. విద్యార్థులను ఛైర్మన్ వరదా రెడ్డి, డైరెక్టర్‌లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, సిఈవో సురేందర్‌రెడ్డి, డిజిఎం గోవర్ధన్‌రెడ్డి, చీఫ్ జోనల్ సాదన్‌రావు, జోనల్ ఇంచార్జి విజయ్ భాస్కర్‌రెడ్డి, డీన్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ అశోక్, శ్రీనివాస్, సుధాకర్, బ్రహ్మం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో రెజొనెన్స్ విజయభేరీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ ఫలితాల్లో జూనియర్, సీనియర్ విభాగాల్లో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకులతో పాటు రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానాల్లో విజయ భేరీ మ్రోగించారని కళాశాల డైరెక్టర్లు ఆర్వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్ రావు తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను జె. సాహితి 467, షేక్ మదార్ సాహెబ్ 467, షేక్ సుజాహత్ అయేషా 467, వి. తేజశ్రీ 467, షేక్ జువేదా నజీరా బేగం 466, బి. క్రాంతి చరిత 466, వై. హాసిని 466, కె. జోషిత 466, ఎం. తీర్థశ్రీ వెన్నెల 466, సిహెచ్ గణేష్ 466, అరూబా జైనాబ్ 466 మార్కులు సాధించారని వారు తెలిపారు. 460కు పైగా 98 మంది విద్యార్థులు, 400లకు పైగా మార్కులు 419 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను షేక్ ఉమ్మె సాల్మా 437, వి. జోషిక 437, వి. గీతికశ్రీ 436, ఎండి అబేద్ 436, కె. తేజిత 434, బి. తరుణ్ 432, బి. భరత్ సంజయ్ 431, కె. నవ్యశ్రీ దుర్గేశ్వరి 430, వి. శివనాగేశ్వరి 430, ఎండి సుహానా 430 మార్కులు సాధించారన్నారు. 400లకు పైగా మార్కులు 36 మంది విద్యార్థులు సాధించినట్లు వారు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గాను ఎం. మాన్వితశ్రీ 994, వి. తన్మయ్ 992, బి. వెంకటశ్రీ వర్షిత 992, డి. హరిక 990, ఎ. హాసిని 990, ఎ. వర్షిణి 990 మార్కులు సాధించినట్లు, వీరితో పాటు 950కు పైగా మార్కులు 168 మంది సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను షేక్ తరున్నం పర్వీన్ 989, కె. హరిక రెడ్డి 988, బి. దివ్యశ్రీ 977, ఎం. ధరణి 977, కె. వర్షిత 972 మార్కులు సాధించినట్లు, 950కు పైగా మార్కులు 29 మంది విద్యార్థులు సాధించారన్నారు. ఇంతటి ఘన విజయం సాధించడానికి పటిష్ట ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, బోధన అనుభవం కలిగిన మేనేజ్‌మెంట్ కారణమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు ఆర్వి నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావు లు అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వి. సతీష్, భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో హార్వెస్ట్ విజయ దుందుభి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్ పరీక్షా ఫలితాల్లో హార్వెస్ట్ కళాశాల విద్యార్థులు అగ్రశ్రేణి ఫలితాలు సాధించి విజయదుందుభి మ్రోగించినట్లు కళాశాల యాజమాన్యం ఆదివారం తెలిపింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 252 మంది , ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 129 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను బి. నీరజ్ 467, ఎస్‌కె లాల్‌బీ 467. బి. సాత్విక ప్రియ 466, ఎం. సాయిదుర్గా 466, ఎస్‌కె మనా తన్వీర్ 465, ఎ. అక్షయ్ 465, నర్సింహా 465, బి. కార్తీక్ రెడ్డి 464, ఓ. రిషి లక్ష్మణ్ 464, ఎం. రేవంత్‌కుమార్ 464, ఎ. కుమార్ నాయక్ 464, టి. హరిక 464, కె. తనుష్క 464 మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో 1000 మార్కులకు రె. రుచిత 993 మార్కులు సాధించి అగ్ర స్థానంలో నిలిచిందన్నారు. ఎ. యామిని 992, ఎ. శ్రీకళ 991, జి. కౌసల్య 989, వి. కీర్తిరెడ్డి 988, జి. ప్రణతి 987, జి. శ్రావణ్ కుమార్ 986, ఎన్ .సిరి సాన్వి 985, షేక్ మహబూబ్ పాషా 985, వై. యశ్వంత్ 984, పి. సంజయ్ రామస్వామి 984, జి. నమిత్ 982, జి. యశ్మిత 982, టిజె రాఘవ చౌదరి 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఎంపిసి మొదటి సంవత్సరంలో 460కు పైగా మార్కులు 27 మంది విద్యార్థులు సాధించారని, ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో 900లకు పైగా మార్కులు 69 మంది సాధించడం హర్షణీయమన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ పి. రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్. పార్వతిరెడ్డి లు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని అభిలాషించారు.

# ఇంటర్ ఫలితాల్లో న్యూవిజన్ విజయ దుందుభి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో న్యూవిజన్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించి మరోసారి విజయ దుందుభి మ్రోగించి తమ ఆధిపత్యాన్ని నిలుపుకుందని కళాశాల ఛైర్మన్ సిహెచ్ జికె ప్రసాద్ తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో జూనియర్ ఎంపిసి విభాగంలో ఏడుగురు విద్యార్థులు 470కు 468 మార్కులు సాధించారని, జూనియర్ బైపిసి విభాగంలో ఇద్దరు విద్యార్థులు 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఎంపిసిలో 1000 మార్కులకు 994, సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు 991 మార్కులతో ఆధిపత్యాన్ని నిలుపుకున్నారన్నారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు బి. రాఘవ 468, ఎన్. తనుశ్రీ 468, ఎస్‌కె నైమా 468, టి. లాస్యశ్రీ 468, బి. కాంక్షిత చౌదరి 468, బి. శిల్ప 468, టి. తేజశ్రీ 468, కె. తన్వీ 467, ఎన్. సాత్విక్ 467, ఎ. స్వర్ణ శ్రీ 467, డి. హన్షినిరెడ్డి 467, కె. అశ్రీత 467, ఎన్. యువన్ సూర్య 467, ఎన్. జితిన్ 467, పి. చాహ్నా 467, ఎస్‌కె రిహాతజ్మిన్ 467, బి. దీప్తిమయి467, జి రూపారెడ్డి 467, ఎన్. సుధీర్ 467, కె. చంద్రహాసిని 467, సిహెచ్ సంజన 467, ఎస్‌కె సమీరా 467, ఎన్. జానకి దుర్గ 467, కె. లాస్య 467, జి.ప్రాతి 467, కె.శ్రీమహాలక్ష్మి 467. ఎన్. భావ్యశ్రీ 467 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు వి. శివశ్రీ 438, డి. అక్షిత 438, ఎ. నిహారిక 437, డి. మహి 437, ఐ. సాత్విక 436, డి. దేవశ్రీ 436, టి. తేజశ్రీ 436 మార్కులు సాధించారని తెలిపారు. సీనియర్ ఎంపిసి విభాగంలో జి. చిన్మశ్రీ 1000 మార్కులకు 994, ఎస్. గౌరీనందన్‌రెడ్డి 993, జే. విష్ణుసాయి 993. కె. నేహాశ్రీ 993, జి. అభినాష్ 993, ఎస్‌కె సమీర్ 993, యు. శృతి 993, పి. సాత్విక 992, కె. ప్రకీర్తి 992 మార్కులు సాధించారని, సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు ఎం. వినాస్ 991, కె. గుణశేషు 989, బి. శశాంక్ 989, కె. ఆరోణ్ నిహల్‌రాయ్ 989, ఎ. విద్యశ్రీ 989, ఎ. నూర్ నాపియా 989, ఎం. రోషిణి 986, బి. అశ్రీత 983, కె. తేజ యాదవ్ 983, గోమతి 982, జి. ప్రణీత్ 982, జి. శ్రీ వెంకట నాగ కోమలి 982, బి. హిమ 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్‌తో పాటు ఐఐటి, మెయిన్స్, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు వారు తెలిపారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ సిహెచ్‌జికె ప్రసాద్, అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, డైరెక్టర్ సిహెచ్ గోపీచంద్, డీన్ శ్రీధర్, ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన స్టెమ్‌స్పార్క్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబర్చి సత్తా చాటినట్లు కళాశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను బి. ప్రతిభ 467, పి. శ్రావ్య 467, పిఎల్ శరత్ చంద్ర 467, జి. గణేష్ 467, కె. గాయత్రి తన్వీష466, డి. అఖిల్ 466, సిహెచ్ హాసిని 466, బి. ధనుష్‌కుమార్ 466, జి. అనీష్‌రెడ్డి 466, షేక్ మహ్మద్ అసిన్ 466, బి. విశాలక్ష్మి 466 మార్కులు సాధించినట్లు తెలిపారు. 460కు పైగా 36 మంది, 450కు పైగా 57 మంది, 400లకు పైగా 98 మంది విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు వై. అక్షిత్ 992, ఎ. భానుతేజ 989, సిహెచ్‌వి సాయి పవన్ 989, సిహెచ్ గాయత్రి 987, సిహెచ్ హిమజ 986 మార్కులు సాధించినట్లు తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయమే లక్ష్యంగా కళాశాల స్థాపించి సామాన్య విద్యార్థులతో అసామన్య ఫలితాలను సాధించినట్లు తెలిపారు. మెయిన్స్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షల్లో కూడా తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణి లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో సర్వజ్ఞ ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సర్వజ్ఞ కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించిందని కళాశాల ఛైర్మన్ ఆర్వి నాగేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు వై. వెన్నెల 468, ఎస్. సాయి మణికంఠ 467, బి. తరుణ్ 467, వై. అనితర 467, జి. అనన్య వెంకట్ 466, జి. జ్ఞాన దీప్తి 466, వై. గీతామాధురి 466, పి. ఆధిత్య 464, బి. హాశ్వంత్ 463, ఎ. భవ్య 463, ఆర్. సాయితేజ 463 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపిసి విభాగంలో 440 మార్కులకు ఐ. సాయి విశ్వనాథ్ 437, జ్ఞాన ప్రసూనాంబ 435, ఎన్. అభినందిత 434, బి. అశ్విత 433 మార్కులు సాధించారని తెలిపారు. స్థాపించిన మొదటి సంవత్సరంలోనే జూనియర్ ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ప్రథమ స్థానంలో సర్వజ్ఞ విద్యార్థులు నిలిచారన్నారు. అత్యుత్తమ అధ్యాపక బృందంతో అన్ అకాడమీ ప్రోగ్రాంతో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ ఆర్వి నాగేంద్రకుమార్, డైరెక్టర్ నీలిమ, అకాడమిక్ డీన్, ఫిజిక్స్ అధ్యాపకులు జనార్ధన్ తదితరులు అభినందించారు. ఐఐటి, జెఈఈ, నీట్ ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తామని వారు తెలిపారు

# ఇంటర్ ఫలితాల్లో ఠాగూర్ విద్యార్థుల విజయకేతనం



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు ఆదివారం విడుదల చేసిన పలితాల్లో ఎస్సార్ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థులు వివిధ గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వాసిరెడ్డి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. మొదటి ఎంపిసి విభాగంలో షేక్ సోహెల్ 470 మార్కులకు గాను 438 మార్కులు, జాస్మిన్ 431 మార్కులు, వై.దివ్య 419 మార్కులు, కామర్స్ విభాగంలో భానుతేజస్విని 394 మార్కులు, వేముల విజయ్ 391 మార్కులు, ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో షేక్ రుబీనా 960 మార్కులు, ఎస్.రామకోటారెడ్డి 899 మార్కులు సాధించారని, కామర్స్ విభాగంలో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి షేక్ అప్సాన 824 మార్కులు సాధించారని, గ్రామీణ ప్రాంత విద్యార్థులు అయినప్పటికీ రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు, లింగారావు, వేణు, చైతన్య, మజీద్, అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ 3వ వార్డులో మడక ముత్యాలరావు నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని ప్రారంభించిన ఖమ్మం జిల్లా కాంగ్రేస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ దంపతులు. ఈ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో రంగా జనార్ధన్ దంపతులు, కాంగ్రేస్ పార్టీ జిల్లా కార్యదర్శి మూడుముంతల గంగరాజు, వైరా మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కోసూరి శ్రీనివాసరావు, వీరంశెట్టి సీతారాములు, ఖమ్మం జిల్లా కాంగ్రేస్ నాయకులు పందిరాజు గౌడ్, వేముల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సహాయం

## వైరా ఎస్సై పుప్పాల రామారావు చేతుల మీదుగా అందజేత



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులో నివాసం ఉంటున్న నిరుపేద విద్యార్థిని పొదిల లక్ష్మీప్రసన్న ఎంసెట్ కోచింగ్ కొరకు కారుకొండ బోస్ ఆధ్వర్యంలో ఆదివారం వైరా ఎస్సై పుప్పాల రామారావు చేతుల మీదుగా రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమె తండ్రి పొదిల వెంకటనారాయణ రోజువారి కూలి ఆర్థిక భారాన్ని గుర్తించిన నాయకులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కట్టా కృష్ణార్జున్‌రావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు నాగబత్తిని భాస్కర్, కొత్తా వెంకటేశ్వరరావు, కిలారు కిరణ్, వైరా పట్టణ అధ్యక్షుడు అప్పం సురేష్, ఏదునూరి శ్రీనివాసరావు, షేక్ కౌసర్, అజీజ్, బత్తుల వెంకటేశ్వరరావు, ఉప్పు వెంకటేశ్వరరావు, మాచర్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ వైద్య కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు

**-నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు జారీ**
**-ప్రజల ఆరోగ్యంపై రాజీ లేదని హెచ్చరిక**
**-జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్**





**ప్రజాపక్షం/ములకలపల్లి:** జిల్లాలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ, ప్రైవేట్ వైద్య సేవల నాణ్యత మెరుగుదలకు జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ ములకల పల్లి గ్రామంలోని ప్రైవేట్ ప్రాక్టీషనర్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అవసరం లేకుండా అధిక శకతి యాంటీబయాటిక్స్ వినియోగం, అనవసరంగా నొప్పి నివారణ ఇంజెక్షన్లు ఇవ్వడం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి పలు లోపాలు గుర్తించారు. అలాగే అనుమతులకతీతంగా బెడ్లు, ఐవీ స్టాండ్లు ఏర్పాటు చేసి, వాడిన ఔషధ వైల్స్ నిల్వ ఉంచడం కూడా గుర్తించారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రైవేట్ ప్రాక్టీషనర్లకు నోటీసులు జారీ చేసి, మూడు రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఉల్లంఘనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ వైద్య సంస్థలు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, ఔషధ వినియోగ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని, ప్రజల ఆరోగ్యంపై ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో ప్రోగ్రామ్ ఆఫీసర్(సీహెచ్ఐ)డాక్టర్ టి ప్రతాప్, డీపీఎంఓ మోహన్ పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/కామేపల్లి:** కొమ్మినేపల్లి జెడ్‌పిహెచ్ఎస్ పాఠశాలలో 1984, 85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన నాటి పూర్వ విద్యార్థులు, గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా జరుపుకున్నారు. 4 దశాబ్దాలుఉ తర్వాత కలుసుకున్న వీరంతా ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, నారాయణలను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పోలూరి సంపత్ కుమార్, సిరికొండ వెంకటేశ్వర్లు, షేక్ నాగులు మీరా, వెంకటరత్నం, సీతయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, ధనియాకుల వెంకన్న, రమాదేవి, విజయలక్ష్మీ, ధర్మవతి, తదితరులు పాల్గొన్నారు.

## ఇస్కఫ్ జిల్లా సమితి ఎన్నిక

**- గౌరవ అధ్యక్షులుగా కేఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ కే. నాగమణి**
**- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గౌతమి క్రిష్ణ, జివిఆర్‌లు**

**ప్రజాపక్షం/పాల్వంచ :** భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం ( ఇస్కఫ్ ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గౌతిమి క్రిష్ణ, గుర్రం వెంకటేశ్వర్లుతో పాటుగా 31 మందితో జిల్లా సమితి, 11 మందితో ఆఫీస్ బేరర్లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ నెల 11, 12వ, తేదీలలో పాల్వంచ దమ్మపేట సెంటర్‌లో గల ఓ హోటల్‌లో ఇస్కఫ్ ప్రథమ జిల్లా మహా సభలను నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా వ్యాప్తంగా అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కలిసి ఇరాన్ దేశం పై చేస్తున్న యుద్ధంతో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర నాయకులు కే. ప్రభాకరరావు, విజయలక్ష్మిలు మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రపంచంలో శాంతి నెలకొనాలని, ఒకదేశం, మరొక దేశం పై పెత్తనం చేయటం నేరమన్నారు. ఆదేశాల సార్వ భౌమాధికారత్వాన్ని దెబ్బతీయటమే అన్నారు. ప్రపంచ శాంతి కోసం ఇస్కఫ్ చేయబోయే కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కౌన్సిల్ గౌరవ అధ్యక్షులుగా కేఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ కే. నాగమణి, అధ్యక్షులుగా గౌతమి క్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు ( జివిఆఆర్)లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వర్కింగ్ ప్రసిడెంట్‌గా భద్రాచలానికి చెందిన సినీ నిర్మాత తాండ్ర వెంకట రమణ, ఉపాధ్యక్షులుగా కాల్వ దేవదాసు, వి. శోభారాణి, ఆర్. లక్ష్మినారాయణ, కార్యదర్శులుగా బండి ఎల్లారావు, పడాల ఆకాంక్ష, ఉప్పుశెట్టి సునీల్, కోశాధికారిగా ఇందిరా ప్రియదర్శినిలను ఎన్నుకొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్స్ ఆల్ టైమ్ రికార్డ్

**- 994 మార్కులు సాధించిన విద్యార్థులు**
**- మొదటి సం. ఫలితాల్లో అగ్రగామి**
**- సమిష్టి కృషితోనే ఫలితాలు**
**- డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్ బాబు**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆదివారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులు ఆల్‌టైమ్ రికార్డు సృష్టించారు. ప్రథమ, ద్వితీయ సం. ఫలితాల్లో జిల్లాలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించారు. ద్వితీయ సం. ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు గానూ భువన్, 994, బైపిసి విభాగంలో బి హాసిని 994 మార్కులు సాధించి ఉమ్మడి ఖమ్మం జిల్లా చరిత్రలో ఆల్ టైమ్ రికార్డును నెలకొల్పారు. వీరితోపాటు ఎంపిసి విభాగంలో మౌనిక్ 992, యశ్విత 992, చైత్రవందన, 990, రామ్‌తేజ 988, సతీష్ 987, అఖిల్ 987, సుమన్య 981, నాగశ్రీవల్లి 981 మార్కులు, బైపిసిలో వర్షిత వర్ధిని 984, నౌషిన్ 980 మార్కులు కైవసం చేసుకున్నారు. అదే విధంగా ప్ర. సం. ఫలితాల్లో చక్కటి ఫలితాలు రాబట్టారు. ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గానూ గీతక 467, కే గీతిక 467, ఆర్ కళ్యాణ్ 466, నిఖిల్ 466, అంజుమ్ 466, అనాజ్ 465, జోషిక 461, జి ప్రైజీ ఫియోన 464, దేవేందర్ రెడ్డి 464, మనోజ్ 461,నక్షత్ర 461, లక్ష్మీ కృష్ణ 460 మార్కులు సొంతం చేసుకున్నారు. బైపిసి విభాగంలో 440 మార్కులకు గానూ ప్రణయ్ 436, చంద్రిక 436,హర్షత 425 మార్కులు సాధించగా ఎంఇసి విభాగంలో 500 మార్కులకు గానూ అనన్య 491, తనీషా మణి 468 మార్కులు, సిఇసి విభాగంలో భావన హాసన్ 479, నిషితరెడ్డి 472, సువర్ణ 466, అర్పియా 465 కైవసం చేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యా చరిత్రలోనే ఇప్పటి వరకు ఉన్న అన్ని రికార్డులను బద్దులు కొడుతూ లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల విద్యార్థులు నూతన రికార్డులు నెలకొల్పారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్ బాబు మాట్లాడుతూ ఈ విజయం సమిష్టి కృషని అని, రాబోయే రోజుల్లో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అదిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కళాశాల ఆవరణలో సత్కరించారు. గత నెల్లో విడుదలైన జేఇఇ మెయిన్స్ ఫలితాల్లో 95.6 శాతం తో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా





**ప్రజాపక్షం/కొత్తగూడెం:** ఆదివారం వెలువడిన ఇంటర్మీయట్ ప్రథమ, ద్వితీయ సం. ఫలితాల్లో మరోసారి బాలికలు తమ సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో ఫలితాలతో పోలిస్తే ప్రథమ సం.లో మొత్తంగా 66.20 శాతం, ద్వితీయ సం.లో మొతంగా 70.58 ఉత్తీర్ణతా శాతం నమోదైంది. ద్వితీయ సం.ఫలితాలు జనరల్ గ్రూపుల్లో బాలురు 69.40 శాతం, బాలికలు 83.45 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఒకేషనల్ గ్రూపుల్లో బాలురు 66.09శాతం, బాలికలు 86.16 శాతం సాధించారు. బాలురు మొత్తం 68.74 శాతం, బాలికలు 84.00 శాతం సాధించడంతో మొత్తంగా బాల బాలికలు కలిపి 77.80 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అదే విధంగా ప్రథమ సం.ఫలితాల్లో జనరల్ గ్రూపులకు గానూ బాలురు 51.78 శాతం, బాలికలు 71.96 శాతం, ఒకేషనల్ విభాగంలో బాలురు 44.69 శాతం, బాలికలు 71.98 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు మొత్తం 50.31 శాతం, బాలికలు 71.69 శాతం ఫలితాలతో బాలిబాలికలు కలిపి మొత్తంగా 62.71 శాతం ఉత్తీర్ణ నమోదు చేశారు. ఈ ఫలితాల్లో కార్పోరేట్ కళాశాలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలకు చెందిన విద్యార్థులు మంచి మార్కులు సాధించారని, రాష్ట్రవ్యాప్త భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ విభాగంలో 9వ స్థానంలో, ఒకేషనల్ గ్రూప్స్‌కు సంబంధించి 8వ స్థానంలో నిలిచింది. ఇంటర్మీడియట్ విద్యాధికారులు తెలిపారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులు, తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు ఎక్కువ మార్కుల కోసం పరీక్షలు రాసుకునేందుకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులు ఈనెల 13 నుండి 20వ తేది లోపు ఆయా కాలేజీల్లో ఫీజులు చెల్లించాలని, ఈ థీయరీ పరీక్షలు మే 13 నుండి రెండు సెషన్లలో ప్రారంభమవుతాయని, ప్రాక్టికల్ పరీక్షలు మే 22 నుండి మొదలవుతాయని చెప్పారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ చేయించుకునే విద్యార్థులు ఈ నెల 13 నుండి 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**భద్రాచలం త్రివేణి విద్యార్థుల ప్రతిభ :** ఇంటర్ ఫలితాల్లో భద్రాచలంలోని త్రివేణి కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. ఎంపిసి, సిఇసి ప్రథమ, ద్వితీయ సం. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి చక్కటి ఫలితాలు రాబట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ సం. విద్యార్థులు 400, 900 పై చిలుకు మార్కులు సాధించడం గర్వకారణమని చెప్పారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణ ఈ విజయానికి కారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రశాంతి, శ్రీకాంత్, అనీల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

**మారుతీ ఒకేషనల్ విద్యార్థుల ప్రతిభ :** మారుతీ ఒకేషనల్ జూనియర్ కాలేజీ భద్రాచలం విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయభేరి మోగించారు. రాగిణి 477, ఇందు ప్రియ 409, ఆకాంక్ష 408 మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు రాబట్టారు. విద్యార్థులను కాలేజీ కరస్పాండెంట్ డా.ఎస్ఎల్ కాంతారావు అభినందించారు.

**ఆర్ఆర్ జూ.కాలేజీ విద్యార్థులు :** భద్రాచలంలోని ఆర్ఆర్ జూ.కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఇంటర్ ద్వితీయ సం.లో ఎంపిసి విభాగంలో లహరి 991, రమ్య 990, అమృత వర్షిణి 990, హరి సత్యశ్రీ 989, మహేశ్వరి 973, హాసిని 959, రామ్ చరణ్ 952, బైపిసి విభాగంలో గాయత్రి 989, సంగీత 964, సిరి ప్రతిమ 941 మార్కులు సాధించారు. జూ. ఇంటర్‌లో ఎంపిసి విభాగంలో పవన్‌తేజ 463, వెంకట నిఖిల్ 461, మోహిత్ కృష్ణ, 425, యెస్విక‌ మెర్సి 423, ఈశ్వరి దుర్గ 417,సంతోష్ 408, లావణ్య 400 మార్కులు, బైపిసి విభాగంలో జెస్సి 411, అన్వేష్ 406, సిఇసి విభాగంలో దాక్షాయని 487 మార్కులు కైవసం చేసుకున్నారు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం మహేశ్వరరావు, మోహన్ సూర్యం, చైతన్య అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినీల ప్రతిభ









**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో తిరుమలయపాలెం కేజీబీవీ విద్యార్థినీలు ఉత్తమ ఫలితాలు సాధించారని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ రమాకుమారి తెలిపారు. కేజీబీవీలో 2026 ఇంటర్ ఫలితాల్లో తమ విద్యార్థినిలు ఉత్తమ ప్రతిభ సాధించడంపై విద్యార్థినిలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం.ఉమాదేవి 470 మార్కులు గాను 464 మార్కులు సాధించగా బైపీసీ లో బి.గాయత్రి 440 మార్కులకు 423 మార్కులు సాధించిందని ఆమె తెలిపారు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో బైపిసి విభాగంలో డి.అంకిత 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించగా ఎంపీసీ విభాగంలో కే.లోహిత 1000 మార్కులకు గాను 968 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆమె తెలిపారు. విద్యార్థినిలు ఎంతో కష్టపడి తమ కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చారని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థినిలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపక బృందానికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## బస్ షెల్టర్ లేక ప్రయాణికుల పాట్లు..

**- మండుటెండలో ప్రయాణికుల పడిగాపులు**
**- నిలువ నీడా లేదు.. కూర్చునే పరిస్థితి లేదు..**
**- తాత్కాలిక ఏర్పాట్లయినా చేయాలంటున్న మండల ప్రజలు**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వందల సంఖ్యలో ఆర్టీసీ బస్సుల రాకపోకలు, వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణాలు. కానీ జూలూరుపాడు మండల కేంద్రంలో ప్రయాణికుల కోసం ఒక్క బస్ షెల్టర్ అయినా కనిపించదు. వ్యాపార, పారిశ్రామిక ప్రాంతమైన జూలూరుపాడు మండల కేంద్రంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. నిలువ నీడ లేక పడరాని పాట్లు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్డు సైనే పడిగాపులు కాస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుండటంతో ఎండ వేడిమికి ప్రజలు తట్టుకోలేక అల్లాడుతున్నారు. మరో వైపు చిన్న పిల్లలు, వృద్ధులు, ప్రయాణికులు నిలువ నీడ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండే ఎండలోనే నిలువ నీడ లేక బస్సుల కోసం గంటల తరబడి రోడ్లపై కిరాణ దుకాణాల ఎదుట, చెట్ల కింద వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. మండల కేంద్రంలో ప్రయాణి కుల కష్టాలపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం...

### అధికారులు, పాలకులకు పట్టింపేదీ...?

మండల కేంద్రంలోని నిర్మించిన బస్ షెల్టర్ ను గత కొన్నేళ్ల క్రితం రోడ్డు విస్తరణు పనులలో భాగంగా తొలగించారు. నాటి నుండి నేటి వరకు పాలకులు గానీ, అధికారులుగాని ప్రయాణికుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బస్ షెల్టర్ నిర్మించాలనే ఆలోచన చేయడంలేదు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం నగరాలకు నిరంతరం ప్రజలు ప్రయాణం చేసే మండలకేంద్రంలో బస్ షెల్టర్ లేక ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో బస్టాండ్ లేక ఎండలోనే చంటి పిల్లలతో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని నెలల క్రితం పాత బస్టాండ్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలంలోనే బస్ షెల్టర్, మరుగుదొడ్లు నిర్మాణం అంటూ శంకుస్థాపన చేసి హడావుడి చేసిన పాలకులు మళ్ళీ విష యాన్ని పక్కన పెట్టడంతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు.

### ఎన్నాళ్లీ దుస్థితి...?

ప్రయాణీకులకు ఇబ్బందులు కలగ కుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా ఆర్టీసీ అధికారులు, ప్రజా పాలకులు ఆచరణలో మాత్రం అమలు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ ద్వారా ప్రభుత్వానికి కోట్ల ఆదాయం సమ కూరుతున్నా సౌకర్యాల కల్పనపై శ్రద్ధచూపడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ప్రయాణికుల రద్దీ మరింత పెరిగింది. దీనికి తోడు మండలకేంద్రం ప్రయాణికులకు ఎలాంటి సదుపాయాలు లేక మండుటెండలోనే ఉండాల్సిన పరిస్థి తులు నెలకొన్నాయి.

### తాత్కాలిక ఏర్పాట్లయినా చేయాలంటున్న ప్రజలు..

గతంలో మెయిన్ సెంటర్ నందు బస్సు షెల్టర్ ఉండేది. రోడ్డు విస్తరణతో దానిని తొలగించడంతో అప్పటి నుంచి ప్రయా ణికులకు కష్టాలు తప్పడం లేదు, అక్కడే బస్ షెల్టర్ ను నిర్మించాలని ప్రజలు అనేక మార్లు అధికారులకు, పాలకులకు మొర పెట్టుకున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే స్పందించి బస్ షెల్టర్తో పాటు మరుగుదొడ్లు, టాయి లెట్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## నలంద విద్యార్థుల రాష్ట్రస్థాయి ర్యాంకులు



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఇంటర్ ఫలితాల్లో కొత్తగూడెం నలంద జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను కైవసం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది అత్యధిక ర్యాంకులు సాధించారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గానూ పి. చరణ్ 469 మార్కులు సొంతం చేసుకుని రాష్ట్రస్థాయిలో నిలిచారు. ఉజ్వల్ అభినవ్ సాయి 468 రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు, హారిక, భరణి, హర్షిణి, జస్పింత రోజ్ 467 మార్కులు సాధించి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు. ఎండి ఆహాద్‌ఖాన్, ఎన్ నాగ సుజీత్, సమీరా, భావన, వి భావన, లలిత ఆదిత్య 466 మార్కులు సాధించగా 30 మంది విద్యార్థులు 460 పైగా మార్కులు సాధించడం గర్వకరాణం అని సిఇఓ చైతన్య కృష్ణ తెలిపారు. బైపివి విభాగంలో 440 మార్కులకు గానూ శ్రీ లక్ష్మి మౌనిక 436 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించగా, కే రేఖ 435 మార్కులు సాధించారు. చరిష్మా మహీన్ తన్విన్ 434 మార్కులతో జిల్లాలో అగ్రగామిగా నిలిచారు. జి అభినవి, రమేష్, శ్రేష్ఠ తమూన్, నవ్య 433 మార్కులు సాధించారు. మరో 17 మంది 420పైగా మార్కులు సాధించారు. జూనియర్ ఎంపిఇ విభాగంలో ఊర్మిల 500 మార్కులకు గానూ 493 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు. సాయిమిథిల, అక్షయ్ 483 మార్కులతో జిల్లా టాపర్లుగా నిలిచారు. సిఇఓ విభాగంలో కౌశిక్ 489, సనారజాక్, మంజు, 488,489శ్రీ3 మార్కులతో అగ్రభాగాన నిలిచారు. అదే విధంగా ద్వితీయ సం. ఫలితాలు ఎంపిసి విభాగంలో ప్రవళిత 994 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించారు. నాగరాజు 993, పవన్ శంకర్ హాన్సిక 990 మార్కులు, బైపిసి విభాగంలో వినీల 990మార్కులు, మైత్రి 986, సహస్ర 986 మార్కులు రాబట్టారు. ఎంఇసి విభాగంలో రంగలహరి 976, సిఇసిలో భూక్య కుషిత 964 మార్కులు సొంత చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించారు. రాష్ట్రస్థాయితోపాటు జిల్లా ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను కళాశాల చైర్మన్ ఎం వెంకట చౌదరి, సిఇఓ చైతన్య కృష్ణ, ప్రిన్సిప్ ఏవి మల్లిఖార్జునావు, ఏఓ రమేష్ అభినందించారు. కాన్సెప్ట్ ఆధారిత బోధన వల్లే ఇంతటి విజయాలు సొంతం అయ్యాయని కళాశాల యాజమాన్యం పేర్కొంది.

## పసుపుదనంతో పరవశింపచేస్తున్న రహదారి



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** అన్నపురెడ్డి పల్లి మండలం ప్రధాన కేంద్రం నుండి వెంకటాపురం వైపు సాగుతున్న రహదారి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటోంది. రోడ్డుకి ఇరువైపులా విస్తరించి ఉన్న పచ్చని చెట్లు, పొలాలు ఆ మార్గాన్ని ఒక అందమైన ప్రకృతి చిత్రంలా మార్చేశాయి. ప్రయాణం చేస్తుంటే, చెట్ల నీడలో నుండి వీచే చల్లని గాలి ప్రయాణికులకు ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తుంది. ఉదయం వేళల్లో పక్షుల కిలకిలారావాలు, సాయంత్రం సూర్యాస్తమయం సమయంలో చెట్ల మధ్య నుండి జాలువారే కాంతి ఈ మార్గానికి మరింత అందాన్ని జోడిస్తున్నాయి. గ్రామీణ జీవనశైలిని ప్రతిబింబించే ఈ రహదారి, రహదారికి పసుపు రంగు వేసినట్లు పువ్వుల దృశ్యాలతో సహజ సౌందర్యాన్ని చాటుతోంది. గ్రామ పాలకవర్గం స్థానికులు చెట్లను సంరక్షిస్తూ ఈ పచ్చదనాన్ని కాపాడుతున్న తీరు అభినందనీయం. ఈ మార్గం కేవలం ఒక రహదారి మాత్రమే కాదు, ప్రకృతితో మమేకమయ్యే ఒక ఆహ్లాదకరమైన అనుభవంగా మారింది. అభివృద్ధి మధ్యలో కూడా ఇలాంటి పచ్చని దారులు నిలవడం, పర్యావరణ పరిరక్షణకు మంచి సంకేతంగా భావిస్తున్నారు. వేసవిలో చెట్ల నీడన సేద తీర్చుకుంటూ బాటసారులు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న పాయం



**ప్రజాపక్షం/పినపాక:** మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పినపాక ఎంఎల్‌ఏ పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఎంఎల్‌ఏకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందించారు. గ్రామాభివృద్ధి, ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం హోమ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 2000 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీతారాంపురం సర్పంచ్ అనిత, స్థానిక సెక్రటరీ ఉపేందర్, పినపాక మండల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మారుమూల గ్రామాలలో సేవలు విస్తృత పరుస్తాం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మారుమూల గ్రామాలలో కూడ వాసవి క్లబ్ భక్తరామదాసు కపుల్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సేవలు విస్తృతంగా చేపట్టనున్నట్లు క్లబ్ ఇంటర్నెషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ గజ్జల రామకృష్ణ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన నూతన కార్యవర్గం అధ్యక్షురాలు గా దోసపాటి కల్పన, ప్రధాన కార్యదర్శి గా దేవరశెట్టి స్రవంతి, కోశాధికారి గా దోసపాటి కళ్యాణి లు ప్రమాణాస్వీకారం ఆయన మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో మరింత బలోపేతమైన సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల ప్రజల కోరిక మేరకు నేలకొండపల్లి మండల కేంద్రంలో క్లబ్ ఆధ్వర్యంలో నూతన బస్టాండ్ ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ చారుగుళ్ల శ్రీనివాస్, చైర్మన్ రేగూరి హనుమంత రావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి రేగూరి వాసవి, రీజయన్ఛైర్మన్ గోళ్ల నరసింహారావు, జోన్ చైర్మన్ నాగబండి శ్రీనివాసరావు, దోసపాటి చంద్రశేఖర్, కొత్తా కరుణ, తెల్లాకుల ఆశోక్, తెల్లాకుల జయశ్రీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్‌నంబర్ ఒకేలా నమోదు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రభుత్వ పథకాలు, ఎరువుల కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడానికి రైతులు తమ మొబైల్ నంబర్‌ను రైతు భరోసా, ఫార్మర్ రిజిస్ట్రేషన్, ఎరువుల బుకింగ్ యాప్‌లలో ఒకేలా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్ సూచించారు. మొబైల్ నంబర్లు వేర్వేరుగా ఉన్నా లేదా పాత నంబర్ అందుబాటులో లేకపోయినా వెంటనే సంబంధిత ఏఈవోలను సంప్రదించి అప్డేట్ చేసుకోవాలని తెలిపారు. లేకపోతే భవిష్యత్తులో ఎరువుల బుకింగ్ సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ మేరకు 13ఏప్రిల్ 2026 ఉదయం 10:30(నేడు) గంటలకు బూర్గంపాడు రైతు వేదికలో మొబైల్ నంబర్ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని కోరారు. ఈ ప్రక్రియను చివరి తేదీ ఏప్రిల్ 20గా నిర్ణయించినట్లు వెల్లడించారు.

## మెరుగ్గా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలు

**ప్రజాపక్షం/కామేపల్లి:** ఐపీఈ ఫిబ్రవరి, మార్చి 2026 ఫలితాల్లో కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. ఫస్ట్ ఇయర్‌లో 17 మందిలో 11 మంది(65 శాతం), సెకండ్ ఇయర్‌లో 21 మందిలో 15మంది(71శాతం)ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఆముదాల మానస 1000కి 961 మార్కులతో రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబరించింది. తదుపరి స్థానంలో దేవండ్ల భవ్య 820 మార్కులు, బైపీసీ నుండి గుగులోతు తేజస్విని 712 మార్కులు, హెచ్ఈసీ నుండి బానోతు కృష్ణవేణి 549 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో సయ్యద్ పర్వీన్ 470 మార్కులకు గాను 396 మార్కులతో మొదటి స్థానం, జైపీసీలో ఎల్లమందల కీర్తన 327, సీఈసీలో మహమ్మద్ రుఖియా, ఖాన్సమ్ అఫ్రా 302 మార్కులు సాధించారు. హాస్టల్, రవాణా సదుపాయాలు లేకపోయినా విద్యార్థులు కష్టపడి సాధించిన ఈ విజయాన్ని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు. రాబోయే బాలికల హాస్టల్‌ను ఉపయోగించుకుని విద్యార్థులు మరింత మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ విద్య జిల్లా అధికారి కె రవిబాబు సూచించారు.

## ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్న బీజేపీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను అణచివేయడానికి చర్యలు తీసుకుంటోందని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం కారేపల్లిలో కే నరేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై దేశ ద్రోహం కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుకావాలని ఎన్ఐఏ నోటీసులు జారీ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజల హక్కుల కోసం మాట్లాడే వామపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసులు పెట్టడం, నిర్బంధాలకు పాల్పడటం తగదని పేర్కొన్నారు. పోటు రంగారావుపై నమోదైన కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో వజ్జా రామారావు, తలారి దేవ ప్రకాష్, భానోత్ బన్సీలాల్, ముక్కా సీతారాములు, తుమోజు రామ్మూర్తి, మద్దెల నాగయ్య, కేశగాని రామ్మూర్తి, దాసరి మల్లయ్య, రవి, శోభన్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీచైతన్య ఖమ్మం ప్రభంజనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య ఖమ్మం కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ప్రభంజనం సృష్టించారు. ఆదివారం ప్రకటించిన ఫలితాల్లో ఇంటర్ సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు 997 మార్కులతో స్టేట్ ఫస్ట్, సీనియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు 996 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు 468 మార్కులు 13 మంది విద్యార్థులు సాధించారని, జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు 438 మార్కులు ఇద్దరు విద్యార్థులు, జూనియర్ ఎంఈసి విభాగంలో 500ల మార్కులకు 496 మార్కులతో స్టేట్ టాప్ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తెలిపారు. సీనియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకు పి.ప్రియాలక్ష్మి 996, ఎండి జారామహేక్ 995, జి. హర్షిణి 995, ఎన్. సూర్యప్రకాష్ 995, జి. తన్మయ్ 994, జి. భావన 994, ఎం.శ్రీఉజ్వల్ 994, కె. యశస్విని 994, ఎం. నిహారిక 994, సిహెచ్ రిషిత్ సాయిశ్రీ 993, వి. కీర్తి 993, వై. భరత్ తేజ 993, ఎన్. సింధూజ 993, ఎస్. బిందు వర్షిణి లక్ష్మి సాయి 993, బి. నిహారిక 993, వై. సాయి శాన్విక 993, ఎస్. నౌషిన్ 993, పి. సాయికీర్తన 993 మార్కులు సాధించారు. సీనియర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకు గాను కె. జోత్స్న 997, జి. విజయాంజలి 992, కె. గాయత్రి 991, ఎన్. ఆకాంక్ష 989, బి. అపూర్వ 988, జి. జాన్ విశిష్ట 988, జి. నవ్య 988, ఎం. ఇవాంజలిన్ 987, ఎస్. హర్షిత 986, ఎ. అశ్విత 986, బి. తేజస్విని 985, ఎన్. స్రవంతి 985, ఎన్. శ్రేష్ట 985, ఐ. ప్రియాంక 985 మార్కులు సాధించారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు బి. రాజవర్ధన్ వర్మ, జి. నాగమల్లేశ్వరి, ఎన్. తన్మయ్ సాయి, జి. హిమశ్రీ, జే. తిలోష్, ఎం. సాయిహర్షిణి, వై. విమ్రిత, ఎ. గగన్య, కె. సంధ్య, ఎం. దేవతి, జి. గయ, డి. త్రిష, కె. సాత్విక లు 468 మార్కులు సాధించారు. జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు వి. ఛాయశ్రీ, జి. శ్రీజ 438 మార్కులు, డి. మమత, ఎస్‌కె అమోత్ సుకుర్ హాషిరా, జుబియా మీర్జా లు 437 మార్కులు, ఎస్. నందిని, బి. అనూష, బి. వాసవి, ఎస్. లక్ష్మి సంజన, కె. నాగలోకేష్‌రెడ్డి లు 436, బి. యశస్విని, సిహెచ్ సుస్మిత, వి.శ్రియ, ఆర్. దర్శిని శ్రీప్రియ, వి. యోజిత, ఎ. సంజన, ఎం. జ్ఞానేశ్వరి, జె. లావణ్య, కె. రక్షిత లు 436 మార్కులు సాధించారు. అదేవిధంగా జూనియర్ ఎంఈసిలో బి. నందునాయక్ 500 మార్కులకు గాను 496, సీనియర్ ఎంఈసిలో ఎస్. వల్లీ వాగ్దేవి 1000 మార్కులకు గాను 985 సాధించారు. జూనియర్ సిఈసిలో 500 మార్కులకు డి. రాజు 489, సీనియర్ సిఈసిలో 1000 మార్కులకు గాను ఎస్‌కె ఆసియా ఫిర్‌దోజ్ 985 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య, అకాడమిక్ డైరెక్టర్ బి. సాయిగీతిక, డిజిఎం సిహెచ్ చేతన్ మాథుర్, ఎగ్జిక్యూటీవ్ డీన్ ఎన్‌ఆర్ఎస్‌డి వర్మ, డీన్ జే. కృష్ణ, ఏజిఎంలు సిహెచ్ బ్రహ్మం, ప్రకాష్, గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

## అమరుల ఆశయాలను సాధించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పరితపిస్తూ అసువులు బాసిన అమరుల ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం పిలుపునిచ్చారు. పాల్వంచ గట్టాయిగూడెంకు చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ సిపిఐ నాయకులు వెంపటి సూర్య నారాయణ ప్రథమ వర్ధంతి ఆదివారం జరిగింది. ఈ సంధర్భంగా సూర్యనారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం విశ్వనాథం మాట్లాడుతూ పాల్వంచ ప్రాంతంలో కామ్రేడ్ సూర్యనారాయణ అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించి భూ పోరాటాలు చేశారని తెలిపారు. కార్మికులు, రైతులు పక్షాన నిలబడి వారి సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని చెప్పారు.ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు 44వ, డివిజన్ కార్పోరేటర్ వీసంశెట్టి విశ్వేశ్వరరావు, భారత జాతీయ మహిళా సమాఖ్య ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, వీసంశెట్టి పద్మజ, ఏఐటియుసినాయకులు దుగ్గిరాల సుధాకర్, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, లాల్‌పాషా, అల్లి వెంకటేశ్వర్లు, కోమటి శ్రీను పాల్గొన్నారు.

# ఆ ఐదు పంచాయతీల కోసం మరో ఉద్యమం

**ప్రజాపక్షం/భద్రాచలం :** రాష్ట్ర విభజన సమయంలో తలెత్తిన సమస్య ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. అశాస్త్రీయ పద్ధతిలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముక్క చెక్కలు గా చేసి తెలంగాణాను ప్రకటించారు, ఆ సమస్య ప్రధానంగా భద్రాచల పూర్వ ప్రాంత ప్రజలతో పాటు విద్యార్థులకు జీవన్మరణ సమస్యగా మారింది. దీనిపై అనేక ఉద్యమాలు చేపట్టినప్పటికీ ఏ మాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఇప్పుడు అదే ఉద్యమం మరో సారి మొదలవుతోంది. రాష్ట్ర విభజన క్రమంలో పోలవరం ముంపు మండలాల పేరుతో ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారు. అందులో భద్రాచలం మండంలోని ఒక్క భద్రాచలం పట్టణం మినహా పూర్తి గ్రామాలు ఏపిలో విలీనం అయ్యాయి. ఇది విద్యార్థులు శాపంగా మారడంతో వారి భవిష్యత్ అంధకారంలో పడింది. మరో ప్రక్క పరిపాలన పరమైన అనేక చిక్కులు వచ్చిపడ్డాయి. ఎంపి వద్దిరాజు రవిచంద్రతో ఈ సమస్యను రాజ్యసభలో లేవనెత్తారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దీనిపై పలు మార్లు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సైతం వినతి పత్రాలు సమర్పించారు. ఆ ఐదు గ్రామ పంచాయితీలు అయిన పురుషోత్తపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు లను తిరిగి తెలంగాణ ఇవ్వాలని, దీంతో పరిపాలన పరమైన సమస్యలు కూడా తీరుతాయమని, రాముడు తెలంగాణలో ఉండగా, రాముని మాన్యం 920 ఎకరాలు ఏపిలో ఉందని, తద్వారా భద్రాచలం అభివృద్ధి కుంటుపడుతోందనే వాదన మరో సారి బలంగా బయటకు వచ్చింది. దీనిని పురస్కరించుకుని నేడు పట్టణంలో భద్రాద్రి పునరేకీకరణ పేరుతో విస్తృతస్థాయి అఖిలపక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఎంపి రేణుక చౌదరి, భద్రాచలం ఎంఎల్‌ఏతో పాటు పలువురు శాసన సభ్యులు, రాజకీయ అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు, ప్రముఖులు, మేధావులు, కవులు, కళాకారులు, జర్నలిస్టులు, పలువురు పెద్ద ఎత్తున హాజరు కానున్నారు. ఈ పోరాటాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసి భుజాన ఎత్తుకుంది.

# రైతులపై కాంగ్రెస్ పార్టీ వివక్షత..

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి
- వడ్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటుచేయాలి
- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల సోమయ్య



**ప్రజాపక్షం/కరకగూడెం:** రైతులపై కాంగ్రెస్ పార్టీ వివక్షత చూపుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రావుల సోమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కరకగూడెం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండల అధ్యక్షులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించు కోకుండా రైతులకు సమయానికి రైతుబంధు వెయ్యకుండా, రైతు బోనస్ లేకుండా, వడ్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చెయ్యకుండా, మోసం చేస్తూ కౌలు రైతులకు 12,000/ఇస్తామని గద్దెనెక్కేదాకా ఎన్నో మోసపురితమైన హామీలను ఇచ్చి ముఖ్య మంత్రి స్థాయి లో రేవంత్ రెడ్డి ఉండి దేవుళ్ళ మీద ఒట్టు మీద ఒట్టు వేస్తూ తమ ఇష్టరీతిలో వ్యవరిస్తూ రైతు యొక్క జీవన సరళిని తెలుసుకోకూడా ఎన్నో మాయ మాటలు చెప్తూ కాలం వెళ్ళదిస్తూ వస్తున్నారు అన్నారు. రైతులకు సరైన న్యాయం చేయాలని లేకుంటే పోరాటం ఉదృతం చేస్తామని, బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు పోగు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బుడగం రాము, మాజీ సర్పంచ్ ఊకె రామనాథం, బైరిశెట్టి చిరంజీవి, ఏళ్ళు రామకృష్ణ రెడ్డి, రావుల కనకయ్య, మాజీ సర్పంచ్ లు పాయం నరసింహారావు, కొమరం విశ్వనాథం, చందా పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ వార్షికోత్సవాలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** భాగ్యనగర్ తండా గ్రామం డీబీ సెంటర్ ప్రాంతంలో బొడ్రాయి 3వ వార్షికోత్సవ వేడుకలు, ముత్యాలమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులతో ప్రతి పనిలో విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు జర్పలా సంధ్య, సందీప్, గిరి ప్రసాద్, వీరన్న, నాగేష్, ధగడ్ సాయి, రవి, కళ్యాణ్, మహిళలు తార, అరుణ, హిరణి తదితరులు పాల్గొన్నారు.

## వివాహ, నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న మాజీ జెడ్‌పిటిసి దంపతులు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పాల్వంచ మండలం జగన్నాధపురం పెద్దమ్మ తల్లి సన్నిధిలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అలేఖ్య, కార్తికేయల వివాహ మహోత్సవానికి బూర్గంపాడు మండలం మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత, రామకొండారెడ్డి దంపతులు హాజరై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ వివాహం సారపాక గ్రామానికి చెందిన బ్రిలియంట్ స్కూల్ అధినేత డాక్టర్ బిఎన్‌ఆర్(బసువుల నాగేశ్వరరావు), స్వర్ణ కుమారి దంపతుల కనిష్ట కుమార్తె అలేఖ్యకు కార్తికేయతో జరిగింది. అలాగే పాల్వంచ మండలం సుగుణ గార్డెన్స్‌లో జరిగిన పవన్ కుమార్‌రెడ్డి, ప్రణీత్ వివాహ వేడుకకు కూడా వారు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ జంట లక్ష్మీ పురం గ్రామానికి చెందిన శ్రీనివాస్ విద్యా నికేతన్ అధినేత లోకిరెడ్డి కోటిరెడ్డి, రమణమ్మ దంపతుల కుమారుడు. అనంతరం బూర్గంపాడు మండలం లక్ష్మీ పురం గ్రామంలో జరిగిన నుసుము కృష్ణారెడ్డి, జాహ్నవి నిశ్చితార్థ వేడుకలో పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. నుసుము వెంకటేశ్వరరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడి కృష్ణరెడ్డి, మారం రామకోటిరెడ్డి, వెంకటరమణ దంపతుల కుమార్తె జాహ్నవి నిశ్చితార్థం జరిగింది. ఈకార్యక్రమాల్లో లక్ష్మీ పురం ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, బుస్సానిఇ నరేష్, గజ్జల లక్ష్మారెడ్డి దంపతులు, గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ప్రజాపందా పార్టీనుండి ఎన్డి పార్టీలోకి చేరిక



**ప్రజాపక్షం/గుండాల :** ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీనుండి ఆ పార్టి ఇల్లందు డివిజన్ నాయకులు బొర్ర వెంకన్న దివారం మండల కేంద్రంలో న్యూడెమోక్రసి పార్టీలో చేరారు. పూనెం రంగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్డి పార్టి డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరావు పార్టి కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు విదానాలకు వ్యతిరేకంగా పోరాడాలంటే కమ్యునిస్టులు, విప్లవ కారులు అకే అజెండాతో ఒకే పార్టీగా కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మండలంలో కమ్యునిస్టు పార్టీలు ఐక్యంకావాలని పిలుపునిచ్చారు.ఈ ప్రాంతంలో ఎన్డి పార్టి పేద ప్రజల తరుపున అనేక పోరాటాలునిర్వహించి హక్కులను సాదించిన చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో మాజి ఎంపిపి ముక్తి సత్యం, గుండాల, కాచనపల్లి సర్పంచులు కోరం సీతారాములు, జర్పుల కిషన్ , పర్షకరవి, వై వెంకన్న, ఉపెందర్, బట్టు ప్రసాద్, క్రిష్ణ, శేఖర్, లాజర్, లాలు, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఆధ్వర్యంలో గ్రామోత్సవ సభ



**ప్రజాపక్షం/గుండాల :** అడవి రామారం గ్రామంలో ఆదివారం పోలీస్ ఆధ్వర్యంలో గ్రామోత్సవ సభను నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐ తిరుపతి మాట్లాడుతూ మారుమూల గ్రామాలు అభివృద్ధికి వెనుక బడటానికి గతంలో రోడ్లు ,విద్యా, వైద్యంసదుపాయాలు లేకపోవడంతో పాటు అసాంఘీక శక్తులు ప్రబావం కారణమని అన్నారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవని,పిల్లలు చెడు మార్గాలకు దూరంగా ఉంటు విద్యపై దృష్టిని సారించాలన్నారు. ముఖ్యంగా యువత మద్యం, గుట్కా వంటి మత్తు పదార్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏజెన్సి గ్రామాల అభివృద్ధికి పోలీస్‌శాఖ పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై సైదా రఫూఫ్, ఉపాద్యాయులు కల్తి నాగేశ్వరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వివాహానికి హాజరైన నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం అప్పాయిగూడెం పంచాయితీ తులిస్య తండా గ్రామంలో లకావత్ భామిని, వీరన్న దంపతులు కుమార్తె స్వర్ణ వివాహం మహేందర్‌తో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ అనుచరులు హాజరై నవ వధూవరులను అశీర్వదించారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఎన్ నాయక్, అప్పాయిగూడెం గ్రామ శాఖ కార్యదర్శి పాలతీయ శివాజీ, భూక్యా కాసనా, భూక్యా రాములు, రావోజి తండా సర్పంచ్ భూక్యా బాలు, వంకుడోత్ రవి, పాలతీయ రాము, వంకుడోత్ సంతు, పాల్త్యా దేవానంద్, వంకుడోత్ వెంకన్న, తదితరులు పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఇంటర్ ఫలితాల్లో శ్రీవిద్య - కృష్ణవేణి కళాశాల ప్రభంజనం

## రాష్ట్ర స్థాయి ర్యాంకులతో మణుగూరు విద్యార్థుల రికార్డు

**ప్రజాపక్షం/మణుగూరు:** ఆదివారం విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర ఫలితాల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరులోని శ్రీవిద్య కృష్ణవేణి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తా చాటారు. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించి కళాశాల కీర్తిని దశదిశలా చాటారు. ప్రథమ సంవత్సరంలో ఎంపిసి, బైపిసి, సిఈసి విభాగాల్లో విద్యార్థులు భారీ స్కోర్లు సాధించారు. ఎంపిసి విభాగం నుండి టి. సాత్విక (467/470 రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్), ఈ. పవిత్ర (467/470 రాష్ట్ర స్థాయి 3వ ర్యాంక్), పి. చరిష్మా శ్రీ (466/470 రాష్ట్ర స్థాయి 4వ ర్యాంక్), కె. ప్రియ హర్షిణి (466/470), బైపిసి విభాగం నుండి సిహెచ్. వర్షిత శ్రీ (435/440), జి. మేఘ వర్షిణి (432/440), సీఈసి విభాగం నుండి ఎస్.కె. రుబీనా (482/500), టి. మీనాక్షి (477/500) సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సర ఫలితాలలో విద్యార్థులు 1000 మార్కులకు గాను దాదాపు పూర్తి మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. సిహెచ్. ధరాహాసిని (ఎంపిసి), 993/1000, వి. లక్ష్మి దివ్య (ఎంపిసి)992/100, జె. హాసిని (ఎంపిసి), 990/1000, టి. దేవి శ్రీ (బైపిసి), 989/1000, జి. లిఖిత (సీఇసి) 974/1000 మార్కులు సాధించారు.




ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, అధ్యాపకుల అంకితభావం మరియు తల్లిదండ్రుల సహకారంతోనే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయి అన్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరిన్ని విజయాలతో నిండాలని కోరుకుంటున్నాము అని తెలిపారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెద్ది నాగేశ్వరరావు, అకాడమిక్ డైరెక్టర్ మర్రి సారంగపాణి, అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో స్టేట్ 2వ ర్యాంకు సాధించిన నవదీప్ కుమార్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్ష ఫలితాల్లో 1000 మార్కులకు గాను 994 మార్కులు సాధించి సులగం నవదీప్ కుమార్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్ సాధించాడు. మండల పరిధిలోని అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన సులగం నరసింహారావు కుమారుడైన నవదీప్ కుమార్, ఖమ్మంలోని కృష్ణవేణి కాలేజీలో చదువుతూ ఈ ప్రతిష్టాత్మక ర్యాంక్‌ను సాధించాడు. నవదీప్ విజయంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. గ్రామానికి గర్వ కారణంగా నిలిచిన నవదీప్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభంజనం

### -తొలి బ్యాచ్‌లోనే 72శాతం ఉత్తీర్ణత...అద్భుత ఫలితాలు

### -గ్రామీణ విద్యార్థుల మెరుగైన ప్రతిభకు నిదర్శనం

**ప్రజాపక్షం/కూసుమంచి:** విద్యా రంగంలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల 2026 ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచింది. 2024లో ప్రారంభమైన ఈ కళాశాల తొలి బ్యాచ్‌లోనే 72శాతం ఉత్తీర్ణత సాధించి విద్యా వర్గాల్లో ప్రశంసలు అందుకుంది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో ఎస్‌కె సీజ్జా ఫాల్కా 977 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలవగా, పిట్టల భార్గవి 907 మార్కులతో ద్వితీయ స్థానాన్ని సాధించింది. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో జంగ లిఖిత్ రెడ్డి 463 మార్కులతో మొదటి స్థానం, ఎమ్‌డి సుహానా 440 మార్కులతో రెండో స్థానం పొందారు. అలాగే ఎం శివాని, ఎన్ సుమంత్, ఆతునూరి యామిని 400 పై చిలుకు మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈసందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం కలిసి కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంతో విద్యార్థులు కార్పొరేట్ స్థాయి ఫలితాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల విజయంపై కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన ప్రభుత్వ కళాశాలలు

## - ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆదివారం విడుదల చేసిన ఇంటర్ మీడియెట్ మొదటి, ద్వితీయ ఫలితాలలో పాల్వంచ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గత సంవత్సరం మాదిరిగానే ఉత్తమ ఫలితాలను సాధించారు. జనరల్ గ్రూపు హెచ్‌ఈసి ద్వితీయ సంవత్సరానికి చెందిన కుమారి ఎస్ మణి సంపన్న 985 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో కళాశాల పేరును నిలబెట్టింది. మరో విద్యార్థి జి. కీర్తి 923 మార్కులను సాధించినది. దీనితో కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌తో పాటుగా లెక్చరర్స్, సిబ్బంది మణి సంపన్న, కీర్తిలను అభినంధించారు. భవిష్యత్‌లో అత్యున్నతమైన, మరింత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. వొకేషనల్ గ్రూపు నుండి ఏఈటి రెండవ సంవత్సరం విద్యార్థి మడకం చొక్కారావు 1000కు గాను 922మార్కులను సాధించారు. గత సంవత్సరం కన్నా ప్రస్తుతం అన్ని గ్రూపుల నుండి అత్యధిక శాతం విద్యార్థులు పాస్ అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

**కిన్నెరసాని డ్యాం సైట్ కళాశాలలో :** తెలంగాణ రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల కిన్నెరసాని డ్యాం సైట్‌లో ఇంటర్ మొదటి సంవత్సరంలో 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 68 శాతంతో 82 మంది పాస్ అయ్యారు. ద్వితీయ సంవత్సరానికి 125 మంది పరీక్షలు రాశారు. అందులో 88 శాతంతో 110 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరం విద్యార్థి పురుషోత్తం 470 మార్కులకు గాను 441 మార్కులను సాధించాడు. బైపిసి ద్వితీయ సంవత్సరంలో జే. చరణ్ 968, వి. మోతీలాల్ 959, ఎం. రాహుల్ నాయక్ 955,



ఎంపిసి రెండవ సంవత్సరానికి చెందిన బి. సాయి అవేష్ 940 మార్కులను సాధించారు.

**కే ఎల్ ఆర్ కళాశాలలో :** ఇంటర్ మీడియెట్ ఫలితాలలో కేఎల్‌ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ఇంటర్ బైపిసి రెండవ సంవత్సరంలో కారం సాధిక 947, ఎంపిహెచ్‌డబ్ల్యూలో ఎండి. రహేనా 964, సిఎస్‌ఈ ద్వితీయ సంవత్సరంలో వాంకుడోత్ అక్షయ 963, మరో విద్యార్థి పోతురాజు మీనాక్షి 959, ఎంపిహెచ్‌డబ్ల్యూలో పత్రి మల్లేశ్వరి 957, ఎంఎల్‌టి మొదటి సంవత్సరంలో మహమ్మద్ మునావర్ 468, పి. శ్రీలక్ష్మిసాయి 466 మార్కులు సాధించారు. వీరిని విద్యా సంస్థల కళాశాలల చైర్మన్ కే. నాగమణి సెక్రటరీ కే. సిద్దార్థ్ రెడ్డి, డైరెక్టర్ మురళీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్, అద్యాపక బృందం తదితరులు అభినంధించారు.

**టిజిఎస్ రెసిడెన్సియల్‌లో :** మండల పరిధి లక్ష్మిదేవిపల్లిలో గల తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ( సిఓఈ ) కళాశాలలో ఓవరాల్‌గా 96.50 పర్సంటేజ్‌తో 75 శాతం ఫలితాలను సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసి నుండి బి. మహేష్ 988, నాగశ్రీ చరణ్ 980, ఎంపిసి నుండి బి. కార్తీక్ 984, జే.శ్రీచరణ్ 977, ఈ. అఖిల్ 974 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో టి. నాగ చైతన్య 430, జే. రాజు 420, బైపిసి పి. సూర్య ప్రకాష్ 380, కే. వరుణ్ తేజ్ 379 మార్కులను సాధించి సత్తా చాటారు.

# ఐపీఈ ఫలితాల్లో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ కళాశాల ప్రతిభ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో ఐపీఈ 2026 ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కరబరిచారు. ఈ ఏడాది కళాశాల మొత్తం ఉత్తీర్ణత శాతం 96శాతంగా నమోదై విశేష ఫలితాలు సాధించగా, ప్రథమ సంవత్సరంలో 75శాతం ఉత్తీర్ణత సాధించారు. కళాశాల నుండి మొత్తం 70 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందులో 67 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 38 మందికి ఏ గ్రేడ్, 27 మందికి బి గ్రేడ్, 2 మంది సీ గ్రేడ్ సాధించారు. విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభలో భాగంగా చిర్రా శ్రావ్య ఎంపీసీ 957/1000 మార్కులతో కళాశాలలో ప్రథమ స్థానం సాధించింది. అలాగే మిరియాల మెలినా ఎంపీసీ 951/1000, జీ నీలిమ బైపీసీ 938/1000, టీ లిఖిత బైపీసీ 898/1000 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో డి అఖిల ఎంపిసి 424/470 మార్కులు, జె దీపిక ఎంపిసి 409/470 మార్కులు, ఏ శ్రావ్య బైపీసీ 404/470 మార్కులు, పి ప్రియదర్శిని బైపీసీ 403/470 మార్కులు సాధించారు. ఇతర విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధించారు. ప్రిన్సిపాల్ జీ సునీత విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల శ్రమ ఫలితమే ఈ విజయమని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ఇంటర్ లో గురుకుల విద్యార్ధుల ప్రతిభ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇంటర్ మీడియట్ పరీక్ష ఫలితాలలో సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంటర్ సెకండ్ హియర్ లో 33 మందికి 900 మార్కులు దాటాయి. సెకండ్ ఎంపీసీ కి చెందిన ధనలక్ష్మి 992 మార్కులు సాధించారు. బైపీసీలో సంజన శ్రీ, 963 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం లో బైపీసీ విద్యార్థి పి.వెన్నీ మరియు అర్చన లు 432 మార్కులు సాదించారు. మొదటి ఎంపీసీ లో మేఘన 446 మార్కులు సాదించారు. సెకండ్ హియర్ లో 95 శాతం, బైపీసీ లో 94 శాతం, మొదటి ఎంపీసీ 58 శాతం, బైపీసీ 72 శాతం ఫలితాలను సాధించారు.





అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థినులను గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత అభినందించారు. అదే విధంగా నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ లో మొదటి సంవత్సరం లో 246 మందికి 143 మంది 58 శాతం ఉత్తీర్ణీత సాధించారు. రెండోసంవత్సరం లో 104 మందికి 69 మంది 66 శాతం ఉత్తీర్ణీత సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు అభినందించారు.

# ఇంటర్ ఫలితాలలో అమ్మాయిలదే హవా..!!

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** తెలంగాణలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. మండల వ్యాప్తంగా బాలికలే పైచేయి సాధించారు. జూలూరుపాడు కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయం ఇంటర్మీడియట్ ఫలితాలలో కస్తూరిబా విద్యాలయం విద్యార్థినులు సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం. 38 విద్యార్థినిలు పరీక్షలు రాయగా 32 మంది ఉత్తీర్ణత సాధించారు. 84% వీరిలో ఎంపీసీ నుంచి 414/440 ఒకరు, ఎంపీసీ నుంచి 398/470 ఒకరు, పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి ముందున్నారు. ద్వితీయ సంవత్సరం 23 మంది పరీక్షలు రాయగా 21 మంది పాసయ్యారు. పాస్ పర్సంటేజ్ (84%). వీరిలో బైపీసీ నుంచి 877/1000 ఒకరు, ఎంపీసీ నుంచి 709/1000 పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి ముందు వరసలో నిలిచారు. సాధనా జూనియర్ కాలేజ్ జూలూరుపాడు విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారు. ప్రథమ సంవత్సరంలో 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 59 మంది పాసయ్యారు. పాస్ పర్సంటేజ్ (77%). మొదటి స్థానంలో సున్నం నవ్య శ్రీ అనంతారం గ్రామం 425/470, ద్వితీయ సంవత్సరంలో 93 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 82 మంది పాసయ్యారు. పాస్ పర్సంటేజ్ (88%). మొదటి స్థానంలో కాకర్ల గ్రామానికి చెందిన కంపసాటి నిహారిక 921/1000 మార్కులు సాధించారు.ఈ సందర్భంగా సాధన జూనియర్ కాలేజ్ యాజమాన్యం సంతోషం వ్యక్తం చేశారు.

# అద్భుత ఫలితాలతో గ్లోబల్స్ జేవీఆర్ అరంగేట్రం

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్స్ జీవీఆర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి సత్తా చాటారు. నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేశారు. జూనియర్ ఇంటర్‌లో 85శాతం ఉత్తీర్ణతతో విజయ దుంధుబి మోగించించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వనం పూజిత 470 మార్కులకు గాను 466 సాధించి మండలంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో, జిల్లాలోని మొదటి పది స్థానాల్లో నిలిచింది. కళాశాలకు చెందిన డేగల గన శ్యామ్ 459/470, వీరబోయిన లోహిత 447/440, బైపీసీలో ఎండీ అస్మా షాగుప్తా 417/440, ఎండీ అద్నాన్ 404/440 మార్కులు సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో చింతలపాటి కార్తీక్ 970/1000, వాచేపల్లి భావన 968/1000 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ 87 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎండీ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ కళాశాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించిన మొదటి సంవత్సరంలో అత్యాద్భుత ఫలితాలు సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయిలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ కళాశాలలో పని చేసిన అధ్యాపకులు తీసుకొచ్చి కళాశాలలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. కళాశాలను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఒరవడితో ముమ్ముందు మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.





# టాపర్లుగా నిలిచిన సాత్విక, దీక్షితకు అభినందనలు

**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం 70 శాతం, ప్రథమ సంవత్సరం 50శాతం ఉత్తీర్ణత నమోదు అయింది. ఈసందర్భంగా ప్రతి గ్రూప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఎంపిసి ప్రథమ సంవత్సరం టాపర్‌గా ఎం సాత్విక 470 మార్కులకు గాను 450 మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం ఎంపిసి విభాగంలో ముత్యం దీక్షిత 1000 మార్కులకు గాను 850 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. విద్యార్థుల విజయంపై ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.





# రాష్ట్రస్థాయి ర్యాంక్‌లతో జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి




**-ఏజెన్సీ ప్రాంత విద్యార్థుల పట్టుదల అభినందనీయం**
**-ఎమ్మెల్యే కూనంనేని, సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

ప్రజాపక్షం/ కొత్తగూడెం: రాష్ట్ర స్థాయి ర్యాంక్ లతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందిందని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా కొనియాడారు. ఆదివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా జిల్లా విద్యార్థులు చూపిన ప్రతిభ ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించి జిల్లా ప్రతిష్ఠను ఇనుమడింపజేయడం గర్వకారణమన్నారు. ఏజెన్సీ జిల్లా అయినప్పటికీ, ఇక్కడి విద్యార్థులు పట్టుదలతో చదివి అద్భుతమైన మార్కులు సాధించడం శుభపరిణామన్నారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారు శుభాకాంక్షలు తెలియజేస్తూ, విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల యజమాన్యాలకు, అధ్యాపక బృందానికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ విజయం జిల్లా విద్యా రంగంలో సరికొత్త ఉత్సాహాన్ని నింపిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# స్త్రీనిధి నిధుల రికవరీ సంగతేంటి..!?



**-అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు..?**
**-దారి తప్పిన డబ్బులు రికవరీ బాధ్యత ఎవరిది..?**
**-పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదు..?**

ప్రజాపక్షం/వైరా: వైరా మండలంలో దారి తప్పిన స్త్రీ నిధి నిధుల సంగతి ఏమిటి, ఎందుకు ఇతవరకు చర్యలు తీసుకోలేదు. డ్వాక్రా గ్రూపుల వద్ద నుండి కాజేసిన స్త్రీ నిధి డబ్బులను రికవరీ చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా, అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారు. రోజులు గడుస్తున్నాయి. నెలలు గడుస్తున్నాయి. సంవత్సరాలు గడుస్తున్నాయి. కాని అధికారుల పనితీరులోనే మార్పు రావడం లేదు, అసలు ప్రక్షాళన చేయాల్సిన తొలి బాధ్యత అధికారుల పైనే, ఎందుకు అంటే అధికారుల మౌనమే స్త్రీ నిధుల కుంభకోణాలు పెరగడానికి కారణం అని చెప్పవచ్చును. ఎందుకు మౌనం వహిస్తున్నారు. ఇప్పటికే వైరా మండలం నారపనేనిపల్లిలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం చేసిన సంగతి తెలిసిందే. అదేవిధంగా మరికొన్ని గ్రామాల్లో కూడా నిధులు దుర్వినియోగం అయినట్లు సమాచారం. ఇలా ప్రతి గ్రామంలో కూడా స్త్రీ నిధి నిధులు పక్కదారి పడుతుంటే డ్వాక్రా గ్రూపుల సభ్యులు వారి బాధను అధికారులకు చెప్పుకున్న కూడా అధికారుల్లో మార్పు రావడం లేదు. కొంతమంది అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారు తప్ప సొమ్ము రికవరికీ ప్రయత్నించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. పెద్ద ఎత్తున నిధులుదుర్వినియోగం అవుతున్నాయి. కష్టించి పనిచేసే రూపాయిల రూపాయి పొదుపు చేసుకుందామనుకున్న మహిళా గ్రూపుల సభ్యులకు కన్నీరే మిగులుతుంది తప్ప కష్టానికి ఫలితం ఉండటం లేదని వాదన వినిపిస్తుంది. జిల్లాస్థాయిలో ఉన్న పిడి, ఏపిడి, ఇతర సంబంధిత స్త్రీ నిధి అధికారులు పూర్తిస్థాయిలో రికవరీలపై గ్రూపుల పరిరక్షణపై ఎలాంటి పర్యవేక్షణ లేదని చెప్పవచ్చును. ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు దాచుకున్న నిధులు దొడ్డి దారిన దోచుకుంటున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని మెప్మాపై కూడా అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉందని చెప్పవచ్చును. ఇప్పటికే పలువురిపై విమర్శలు సైతం వినిపిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ జిల్లా అధికారులు సంబంధిత వారి క్రింద అధికారులతో సరైన కోఆర్డినేటషన్ లేకనే నిధులు పక్కదారి పడుతున్నాయని చెప్పవచ్చును. సిసిలు పర్యవేక్షణ కూడా నామమాత్రంగానే ఉంది. తప్పు జరిగిందని తెలిసిన మరుక్షణమే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే పోయిన ప్రతి రూపాయిలు రికవరీ చేయవచ్చు. మరోసారి స్త్రీనిధి డబ్బులు దుర్వినియోగం కాకుండా భయం అనేది వారిలో కలగాలి అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# కొత్త పింఛన్లకు మోక్షమెన్నడో..?



**-ఏళ్ల తరబడి అభాగ్యుల నిరీక్షణ**
**-ప్రజాపాలనలోనూ అదే దుస్థితి**

ప్రజాపక్షం/నేలకొండపల్లి : సమాజంలో ఆదరణ కరువై, ఆర్థికంగా చితికిపోయిన అభాగ్యులకు ప్రభుత్వం అందించే చేయూత పింఛన్లు అందని ద్రాక్షలా మారాయి. కొత్త పెన్షన్ల మంజూరు నిలిచిపోవడంతో వేలాది మంది నిరుపేదలు కళ్లల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు. నేలకొండపల్లి మండల వ్యాప్తంగా ఏ గ్రామంలో చూసినా అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు.. మా పెన్షన్ ఎప్పుడొస్తుంది..?అని అధికారులను వేడుకుంటున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి.

**ఆశలు రేపిన బడ్జెట్.. ఆచరణలో ఏది..?**

ఇటీవల రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో కొత్త పెన్షన్ల మంజూరుకు నిధులు కేటాయిస్తామని, అర్హులకు న్యాయం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అభాగ్యుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారలేదు. గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు తోడు, ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కొత్తగా వచ్చిన దరఖాస్తులు మండల కార్యాలయంలో కుప్పలుతెప్పలుగా పేరుకుపోయాయి.

**నేలకొండపల్లిలో నిరీక్షణ పర్వం...**

మండలంలోని వివిధ గ్రామ పంచాయితీల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం. వందలాది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నాయి. 2022 ఆగస్టు తర్వాత కొత్త పెన్షన్ల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో చాలా మంది వృద్ధులు మందు బిళ్లల కోసం, కనీస అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు చేతిలో చిల్లిగవ్వ లేక, అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. ఆర్థిక భరోసా లేక కాయకష్టం చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు.పెరిగిన ధరల దృష్ట్యా ప్రభుత్వం ఇచ్చే కొద్దిపాటి సాయం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ప్రజాపాలనలోనూ అవే విన్నపాలు...**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనలో అత్యధికంగా వస్తున్నవి పెన్షన్ దరఖాస్తులేనని అధికారులు చెబుతున్నారు. వార్డు సభలు, గ్రామ సభల్లో ప్రజల నుంచి వస్తున్న ప్రధాన డిమాండ్ కొత్త పింఛన్ల మంజూరే. మండల స్థాయిలో అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తున్నప్పటికీ, పైస్థాయి నుంచి అనుమతులు రాకపోవడంతో మేము ఏమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు.

**ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూపు...**

నేలకొండపల్లి మండలంలో ప్రస్తుతం అందుతున్న పింఛన్ల లబ్ధిదారులు వేలల్లో ఉన్నప్పటికీ, అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారు మరో వెయ్యికి పైగానే ఉంటారని అంచనా. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం తక్షణమే స్పందించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి కొత్త పింఛన్లను మంజూరు చేయాలని మండల నిరుపేదలు డిమాండ్ చేస్తున్నారు.

# ఇంటర్ ఫలితాల్లో విశ్వప్రియ ప్రతిభ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డుకి చెందిన కారుకొండ బోస్ కూతురు చందన విశ్వప్రియ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపిసిలో 470 మార్కులకు గాను 461 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా కారుకొండ విశ్వప్రియను పలువురు అభినందించారు. కారుకొండ బోస్ కూతురు విశ్వప్రియ ఖమ్మం చైతన్య కాలేజీలో ప్రథమ సంవత్సరం ఎంపిసి చదువుతుంది.

# ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల హవా

ప్రజాపక్షం/వైరా: సాంగిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 90% ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సర ఇంటర్ విద్యార్థులు 95% ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు 66 మంది పరీక్షలు వ్రాయగా 56 మంది ఉత్తీర్ణులైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ దేవులపల్లి సమత తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్ పరీక్షలకు 62 మంది హాజరు కావాల్సి ఉండగా 61 మంది హాజరయ్యారని, వారిలో 58 ఉత్తీర్ణులు అయ్యారని, ముగ్గురు ఫెయిల్ అయినట్లు ఎతలిపారు. ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత సాధించిన వారిలో ఏ గ్రేడ్ 43, బి గ్రేడ్ 15 మంది ఉన్నారు. అలాగే ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఏ గ్రేడ్ 33, బి గ్రేడ్ 18, సి గ్రేడ్ 5. ద్వితీయ సంవత్సర ఫలితాలు నిరాశపరిచినట్లు ప్రిన్సిపాల్ సమత వెల్లడించారు.

# తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

**-రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**



ప్రజాపక్షం/ ఖమ్మం : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పినవిధంగా చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక శ్రీధర్ హోటల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మందా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు మాట్లాడుతూ హామీలను అమలు చేయకపోతే రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమకారుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టక తప్పదన్నారు. అనేక మంది త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఆయన తెలిపారు. ఉద్యమ కారులను విస్మరించడం వల్లనే బిఆర్‌ఎస్ తగిన ఫలితం అనుభవించిందని ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు శీలం పాపారావు తెలిపారు. తక్షణం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హామీలు అమలు చేయకపోతే ప్రభుత్వం తగు ఫలితం అనుభవించక తప్పదని పాపారావు హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ సంఘాల బాధ్యులు పాలకుర్తి కృష్ణ, కేలోత్ రవిచంద్ర, శ్రీను, యానాలి సాంబశివరెడ్డి, వై. చిట్టి మల్లు, బాలస్వామి, గోవింద్, రమాదేవి, గ్లోరి తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో ఖమ్మం నారాయణ ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం : తెలంగాణ రాష్ట్ర ఇంటర్ ఫలితాల్లో ఖమ్మంజిల్లాకు చెందిన ప్రముఖ విద్యా సంస్థ నారాయణ జూనియర్ కళాశాల రాష్ట్రస్థాయిలో జూనియర్ ఎంపిసి విభాగంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఎంపిసి విభాగంలో కె. సాయిగౌతమ్ 470 మార్కులకు గాను 469 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. అదేవిధంగా హర్షిత భరద్వాజ్, సెలైన దానిక, భువనశ్రీ, లహరి, లక్ష్మీ శ్రీజ 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించారు. లోహిత్, గౌతమి, రితిక, జోషిక, దీప్తి, హానీ 467 మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో పి. సాధన 440కు గాను 434 మార్కులు, కె. రుతిక హాసిని 433, సీనియర్ ఎంపిసి విభాగంలో పాటి వర్షిత్ 1000 మార్కులకు గాను 994, అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల డీన్ లక్ష్మయ్య చౌదరి, ప్రిన్సిపాల్స్ నాగేశ్వరరావు, రాం బ్రహ్మచారి, పవన్, అధ్యాపక బృందం అభినందించారు.

# ఇంటర్ ఫలితాల్లో ఆర్‌జెసి ప్రభంజనం



ప్రజాపక్షం/ఖమ్మం విద్యా విభాగం : ఇంటర్ ఫలితాల్లో ఖమ్మం ఆర్‌జెసి విద్యార్థులు సత్తా చాటారు. బైపిసి ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఎస్. భానుమతి 1000 మార్కులకు గాను 975 మార్కులు సాధించగా బైపిసి, సిఈసి మొదటి సంవత్సరం విద్యార్థులు సిహెచ్ త్రిష, సిహెచ్ సాహితి 440 మార్కులకు గాను 414, ఎన్. ఆకాష్ 500 మార్కులకు గాను 448, సిఈసి ద్వితీయ సంవత్సరం విద్యార్థి రమ్య 1000 మార్కులకు గాను 900 మార్కులు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీ పతి, ఇంచార్జి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన బ్రిలియంట్ విద్యార్థులు



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఇంటర్ ఫలితాలలో స్థానిక సారపాక బ్రిలియంట్ కాలేజ్ నందు ఫస్ట్ ఇయర్ ఎంపిసిలో 470 మార్కులకు గాను 466 మార్కులతో ఆర్ పావని స్టేట్ థర్డ్, 465 మార్కులతో కే బన్య శ్రీ స్టేట్ ఫోర్త్, 464 టీ భవ్య శ్రీ స్టేట్ ర్యాంకులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. సెకండియర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులతకు గాను బి జాహ్నవి 982 మార్కులు సాధించింది. ఈ ఫలితాలతో బ్రిలియంట్ విద్యార్థులు అందరిని అబ్బురపరిచారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యాసంస్థల అధినేత గురు బ్రహ్మ అవార్డు గ్రహీత, నంది అవార్డు గ్రహీత, డాక్టర్ బివిఆర్ మాట్లాడుతూ మన సారపాకలో స్టేట్ మార్కులు రావడం గర్వంగా ఉందన్నారు. ఇంతటి విజయానికి సాధించడంలో కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థులని, వారి తల్లిదండ్రులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్స్ మిఠాయిలు తినిపించారు.